క్లుప్తంగా

మహిళా దినోత్సవ శుభాకాంక్షలు



సింగరాయకొండ: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది అందరికీ ఆదర్శంగా నిలవాలని.. మహిళలు ఎదిగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు మహిళా దినోత్సవం సంతోషాలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు.

153 మందికి వైద్య పరీక్షలు



పామూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక భారతీయ స్టేట్ బ్యాంకులో బ్యాంకు మేనేజర్ అమురు వెంకటేశులు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ నారాయణం శేషశయన దీక్షితులు 153 మందికి ఉచితంగా సాధారణ వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా బీపీ, షుగర్, థైరాయిడ్‌తోపాటు పలు వ్యాధులకు ఉచితంగా బ్యాంకు ఆధ్వర్యంలో మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిలాని, వీరబ్రహ్మం, ఎస్.సురేంద్రరెడ్డి, కే.సాయిచరణ్, ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

హాజీపురంలో క్యాన్సర్ సర్వే



హనుమంతునిపాడు: క్యాన్సర్ అనుమానితులను గుర్తించేందుకు అధికారులు ఎన్‌సీడీ సర్వే నిర్వహించారు. మండలంలోని హాజీపురం హెల్త్ క్లినిక్ పరిధిలో జరిగిన క్యాన్సర్ సర్వేను జిల్లా కోఆర్డినేటర్ పీ వాసవి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక వైద్య సిబ్బంది మండలంలో ముందస్తుగా క్యాన్సర్ అనుమానితులను గుర్తించేందుకు సర్వే నిర్వహించారు. సర్వే సక్రమంగా జరిగిందా లేదా అనేదానిపై తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు దార్ల సందీప్‌కుమార్, సీహెచ్‌ఎం కేవిచెన్నయ్య, ఎంఎల్‌హెచ్‌పీట నాగమణి, ఎస్ఎం చెన్నలక్ష్మీ, ఆశాలు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై అప్రమత్తత అవసరం

పామూరు: ఫ్లోరిసిస్‌పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఫ్లోరోసిస్ జిల్లా అధికారి డాక్టర్ వీ అనిల్‌కుమార్ అన్నారు. జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని తిరగలదిన్నె ఎంపీపీఎస్ పాఠశాల, గ్రామంలో ఫ్లోరోసిస్ లక్షణాలు, జాగ్రత్తలు వివరించారు. అదేవిధంగా మండల కేంద్రం పామూరు 3, 4 సచివాలయాల పరిధిలో క్యాన్సర్ సర్వేను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రుబీనా, హెచ్‌ఈఓ ఎస్.బ్రహ్మానందం, పెరుగు శ్రీధర్, టెక్నీషియన్ కే.అంజిరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎస్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



పరీక్ష సామగ్రి అందజేస్తున్న దాతలు, హెచ్ఎం

సీఎస్‌పురం (పామూరు): దాతల అందించిన పరీక్ష సామగ్రిని విద్యార్థులు వినియోగించుకోవాలని పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం జి.లక్ష్మణరావు అన్నారు. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థి, రిటైర్డ్ హెచ్ఎం తాతపూడి ఇశ్రాయేల్ ప్రతాప్ తన సొంతనిధులతో సమకూర్చిన పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, జామెంట్రీ బాక్స్‌లను హెచ్ఎంతో కలిసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా దాతను హెచ్‌యం, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఎం.సధ్యారాణి, జి.వేమనారాయణ, బి.చిన్ననారాయణ, పోతురాజు, శ్రీనివాసులు, గంగాధర్, జి.నారాయణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా రహిత గ్రామాలే లక్ష్యం

సీఎస్‌పురం(పామూరు): నాటుసారా రహిత గ్రామాలను నిర్మించేందుకు ప్రజలు కలిసి రావాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు ఆర్.నరహరి, రామారావు, కనిగిరి ఎక్సైజ్ సీఐ విజయభాస్కర్‌లు అన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని బి.కేటగిరి నాటుసారా తయారీ కేంద్రం మైలుచర్ల గ్రామంలో పరివర్తన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు నాటుసారా సేవించడం ద్వారా అనర్థాలను వారు వివరించారు. నాటుసారా తయారీ కేసుల్లో పేర్లు నమోదైతే ఎటువంటి ప్రభుత్వ పథకాలు కూడా పొందలేరన్నారు. కార్యక్రమంలో బీ వెంకటేశ్వర్లు, సిబ్బంది, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళా మేలుకో..
నీ భవిత తెలుసుకో



ఉపాధి హామీ పని చేస్తున్న మహిళలు

● నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

పొన్నలూరు:

ఆధునిక ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ముందుకుసాగుతున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళల జీవన ప్రమాణాలు పెరిగాయి. నేడు ఏ రంగంలో చూసినా మహిళామణుల భాగస్వామ్యం పెరుగుతోంది. సాధారణ జీవితం నుంచి అసాధారణ పరిస్థితుల వరకు మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుకుంటున్నారు. తమలోని నైపుణ్యాలను వెలికితీస్తూ ఆడది అబలకాదు సబలని నిరూపించుకుంటున్నారు. ఒక వైపు కుటుంబ బాధ్యతలు చేపడుతూ మరోవైపు ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో తాము దేనికి తీసిపోమని ఆధిక్యతను చాటుతున్నారు. మహిళలు మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా ఎదిగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమంటూ నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలువురు మహిళా అధికారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

మహిళల కోసం ప్రత్యేక చట్టాలు రావాలి..



దేశంలో మహిళా చట్టాలను మరింత పటిష్టం చేయాలి. ప్రస్తుతం ఉన్న చట్టాలకు తోడుగా ప్రత్యేకమైన ఆర్డినెన్స్‌ను తీసుకురావాలి. నిత్య జీవితంలో మహిళలు, యువతులు ఎదుర్కొంటున్న వేధింపులకు చరమగీతం పాడే విధంగా పురుషులే చొరవచూపాలి. నేటి యువతులు తమ గళాన్ని నిర్భయంగా వినిపించి సమాజాన్ని చైతన్యవంతం చేసి ఆదర్శవంతంగా నిలివాలి.

వై సత్యవతి, జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు

సురక్షిత సమాజం అవసరం..



మహిళలు, బాలికలు స్వేచ్ఛగా, నిర్భయంగా జీవించినప్పుడే సురక్షిత సమాజం ఆవిర్భవిస్తుంది. ఇల్లు, కార్యాలయాలు, పాఠశాలలు, రహదారులతో పాటు అనేక చోట్ల ఎక్కడపడితే అక్కడ లైంగిక హింస, వేధింపులు ప్రతిరోజు అధికంగా పెరిగిపోతున్నాయి. అ సాంఘిక శక్తుల పట్ల నామమాత్రపు చర్యలు, కంటితుడుపు చట్టాలతో ప్రపంచవ్యాప్తంగా మహిళా నిర్లక్ష్యానికి గురవుతూనే ఉంది.

పీ సుజాత, ఎంపీడీఓ, పొన్నలూరు

విద్య ద్వారానే మహిళల్లో చైతన్యం..



మహిళా విద్యావంతురాలైనప్పుడే సమాజం చైతన్యం అవుతుంది. ప్రతి మహిళా విద్యావంతురాలైతే కుటుంబమంతా వికసిస్తుంది. కుటుంబంతో పాటు సమాజంలో ఉన్న మూఢ నమ్మకాలు మహిళా చైతన్యం ద్వారానే తొలుగుతాయి. గ్రామాల్లోని వయోజనులు కూడా సాధ్యమైనంత వరకు విద్యనేర్చుకోవాలి.

– ఎస్‌డీ ఉమేరా, పీహెచ్‌సీ డాక్టర్, పొన్నలూరు

మహిళలకు పూర్తి స్వాతంత్ర్యం రావాలి..



ప్రస్తుత సమాజంలో మహిళా అర్ధరాత్రి ఒంటరిగా తిరగడం పక్కనపెడితే.. నేడు పట్టపగలు కూడా తిరగలేని పరిస్థితులు దాపురించాయి. మహిళల రక్షణ కోసం ప్రస్తుత ప్రభుత్వాలు ప్రత్యేకమైన మరికొన్ని చట్టాలను ప్రవేశపెట్టాలి. మహిళలకు సంపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్ర్యం దక్కినప్పుడే దేశానికి అసలైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అవుతుంది.

– కే గోవిందమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు

మహిళలు రాజకీయాల్లో రాణించాలి..



నేటి కాలంలో మహిళలు వంటింటికే పరిమితం కాకుండా తమకున్న రాజకీయ రిజర్వేషన్లను ఉపయోగించుకుంటూ గ్రామీణ స్థాయి నుంచి దేశ రాజకీయాల వరకు ఎదగాలి. పురుషులకంటే తామేమి తక్కువ కాదంటూ అన్ని రంగాల్లో ముందుండాలి. మహిళలను చిన్న చూపు చూస్తున్న పురుషులు వారి ఆలోచిన విధానాన్ని మార్చుకోవాలి.

– జి శారమ్మ, సర్పంచ్, చెన్నిపాడు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

పొన్నలూరు: నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె రమాదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా సాధికార వారోత్సావాల్లో భాగంగా మండలంలోని ముండ్లమూరివారిపాలెంలో శుక్రవారం విద్యార్థినులతో ర్యాలీ చేపట్టి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న కాలాన్ని బట్టి మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. బాలికలు, విద్యార్థినులు చెడు వ్యసనాలకు లోను కాకుండా ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలన్నారు. అనంతరం మహిళలు, విద్యార్థినులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శివరామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థునులు పాల్గొన్నారు.



ఉప్పలపాడులో ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

మహిళల ఆర్థికాభివద్ధికి తోడ్పడాలి..

పీసీపల్లి: మహిళల ఆర్థికాభివద్ధికి అందరూ సహకరించాలని ఎంపీడీవో ప్రభాకర్ శర్మ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆదరణ-3 కి సంబంధించి అన్ని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు.

మద్రిపూడి: మండలంలోని గార్లపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముందస్తుగా మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని హెచ్ఎం తూగుట్ల బిక్షాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా దినోత్సవం ఆవశ్యకతను విద్యార్థులకు ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులైన స్వర్ణశ్రీ, అమరేశ్వరి, ఉమామహేశ్వరి, రమాదేవిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, గౌస్‌బాషా, ఆదినారాయణ, శ్రీరాంమురళి, మనోహర్, నాగప్రసాదు, రవిలు పాల్గొన్నారు.

ఉప్పలపాడులో..

కొండపి: ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ప్రధానోపాధ్యాయుడు వి. సూసన్న కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కే ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముందస్తుగా మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సూసన్నకుమార్ మాట్లాడుతూ మహిళలు ప్రతి రంగంలో రాణించడం అభినందనీయమని, గతంలో మహిళలు అంటే ఇంట్లోకి పరిమితం అనే మాట్లాడుకున్నారు అని, ఇప్పుడు సమాజంలో ప్రతి కార్యక్రమంలో మహిళలు పురుషులతో పాటు పోటీ పడుతున్నారని అన్నారు. అనంతరం పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయినులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



ముండ్లమూరివారిపాలెంలో బహుమతులు అందజేస్తున్న రమాదేవి



గార్లపేటలో మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్ఎం

ఆదరణ పథకాన్ని వినియోగించుకోవాలి

పొన్నలూరు: కుల వృత్తిదారుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆదరణ పథకాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని ఎంపీడీఓ సుజాత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆదరణ-3 పథకంపై కార్యదర్శులు, వీఆర్వోలు, లబ్ధిదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఆదరణ పథకంతో ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ, ఈబీసీ, కాపు సామాజికవర్గాలకు చెందిన వారికి ఆధునిక పనిముట్లు అందిస్తారన్నారు. దీనిపై అధికారులు ఆయా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే 18 నుంచి 50 ఏళ్ల లోపు మహిళలకు కుట్టు మిషన్‌పై 90 రోజులు శిక్షణ ఇచ్చి ఉచితంగా మిషన్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేశ్వరరావు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



పొన్నలూరులో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుజాత

వైద్య శిబిరాలతో ఉపయోగం



శిబిరాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ గఫార్, డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ సృజన

కనిగిరిరూరల్: వైద్య శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. ఒంగోలు రిమ్స్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ సృజన మాట్లాడుతూ వృద్ధాప్య ఆరోగ్య సంరక్షణకు సామాజిక న్యాయం, సాధికార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు డాక్టర్ చంద్ర శేఖర్, సోషల్ వర్కర్ అనీల్ కుమార్, వైద్యులు ఫణికుమార్, ప్రియార్ష నంద, హేమ సుధా, యోషిత, ఆశ్రమ నిర్వాహకులు రంగనాయకులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టుపై నిర్లక్ష్య వైఖరి తగదు



మాట్లాడుతున్న సయ్యద్ యాసీన్

కనిగిరిరూరల్: పశ్చిమ ప్రాంత ప్రజల ఆశాజ్యోతి అయిన వెలిగొండ ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు నిర్లక్ష్య వైఖరిని అవలంభించడం సరైంది కాదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ యాసీన్ విమర్శించారు. శుక్రవారం స్థానిక దర్శి చెంచయ్య భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. వెలుగొండ ప్రాజెక్టుకు తామే శంకుస్థాపన చేశాం తామే పూర్తి చేస్తామంటూ గొప్పల డప్పాలు కొట్టే చంద్రబాబు ప్రభుత్వం.. బడ్జెట్‌లో నిధులు కేటాయింపులో అరకొరగా చేయడాన్ని తీవ్రంగా మండిపడ్డారు. కేవలం రూ.350 కోట్లు మాత్రమే వెలిగొండ ప్రాజెక్టుకు కేటాయించడం చంద్రబాబు నైజానికి నిదర్శనమన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పట్ల చిత్త శుద్ధితో వ్యవహరించక పోతే ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. పశ్చిమ ప్రాంత ఎమ్మెల్యేలు వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు కేటాయించే విధంగా వత్తిడి చేయాలన్నారు. జిల్లా పర్యటనలో నేడు మార్కాపురానికి వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టును సందర్శించే కార్యక్రమం రద్దు చేసుకోవడం శోచనీయమన్నారు. మార్కాపురంను నూతన జిల్లాగా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మహిళలు, కులవృత్తులవారికి ఆదరణ

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మహిళలు, కులవృత్తులవారికి ఆదరణ-3పై పీఎస్‌లు, వీఓలు అవగాహన చేయాలని డీఎల్‌డీఓ కే.శ్రీనివాసులురెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య అధ్యక్షతన ఆదరణ-3 మీద పీఏస్‌లు, వీఓఏలు, కులవృతి సంఘాలతో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు టైలరింగ్‌లో 90 రోజులపాటు శిక్షణనిచ్చి వారికి ఉచితంగా కుట్టుమిషన్లు అందజేయడం ద్వారా వారు ఆర్థికంగా బలోపేతమవుతారన్నారు. అదేవిధంగా వివిధ కులాలకు సంబంధించి వారికి పనిముట్లు ఇవ్వడం ద్వారా వారు స్వతహాగా వారి కులవృత్తులు చేసుకోవడంద్వారా అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో పీఏస్‌లు వి.బ్రహ్మానందరెడ్డి, జి.వాణి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మండలంలోని పీఎస్‌లు, వీఓలు, కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో సూచనలిస్తున్న డీఎల్‌డీఓ, ఎంపీడీఓ

గుడ్డ సంచులతో పర్యావరణ పరిరక్షణ

పామూరు: పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని దూరంచేసి గుడ్డ సంచులు, జూట్ సంచులనే వాడాలని ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం జి.భోగేశ్వరరావు అన్నారు. స్థానిక హైస్కూల్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో మండలంలోని నర్రమారెళ్ల ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయుడు తోట రమేష్ తన సొంత నిధులతో సమకూర్చిన 550 గుడ్డ సంచులను ఇన్‌చార్జ్ హెచ్ఎం, దాత విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరికి పర్యావరణాన్ని పరిరక్షించాలన్సిన బాధ్యత ఉందని, దీనికోసం ప్లాస్టిక్ విన యోగాన్ని తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో పీ షేక్ మస్తానీ, తూరెడ్డి వెంకటేశ్వర్లు, జమ్ముల శ్రీనివాసులు, జి.సురేంద్ర, వేణుగోపాల్, సీహెచ్.సుధాకర్, సీహెచ్.బసవేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



గుడ్డ సంచులు పంపిణీచేస్తున్న ఇన్‌చార్జ్ హెచ్ఎం, దాత

మహిళా హామీలు విస్మరించిన కూటమి



వైఎం సరితా ప్రసాద్‌రెడ్డి

కనిగిరిరూరల్: కూటమి సర్కార్ ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీలను అమలకు తూట్లు పొడిచి.. మహిళా సాధికారతను విస్మరించిందని ఏఎంసీ మాజీ చైర్మన్ వైఎం సరితా ప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 50 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించి మనోధైర్యాన్ని ఇచ్చారన్నారు. మహిళా సాధికారత కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. దిశ యాప్ ద్వారా మహిళలకు రక్షణగా నిలిచారని వివరించారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో మహిళలకు అనేక వాగ్దానాలు చేసి.. వాటికి తొంగలో తొక్కుతున్నారని విమర్శించారు. ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు, స్త్రీ నిధి, విద్యా లక్ష్మీ, కళ్యాణ లక్ష్మీ పథకాల ఊసే లేదని ఘాటుగా విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో మహిళలపై దాడులు, అఘాయిత్యాలు, అత్యాచారాలు పెరిగాయన్నారు. మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్సాహంగా మహిళా ఉద్యోగుల క్రీడా పోటీలు

కనిగిరిరూరల్: మహిళలు అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా నిలవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని వైద్య సిబ్బందికి క్రీడా పోటీలు శనివారం నిర్వహించారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మహిళా వైద్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిండెంటెంట్ వెంకట సుబ్బయ్య, వైద్యులు సునీత, హేమ సుధ, యోషితా, సర్పంచ్ దమ్ము వెంకటయ్య, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మండు రమేష్, ప్రవీణ్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

సర్పంచ్ చెక్ పవర్ రద్దు

హనుమంతునిపాడు: మండల పరిధి లింగంగుంట్ల గ్రామ సర్పంచ్ మద్ది నాగరత్తలు చెక్ పవర్ రద్దు అయినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో హనుమంతారావు శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.15 లక్షలు ఆర్థిక సంఘ నిధులు పనులు చేయకుండానే మార్చుకొని స్వాహా చేసినట్లు గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ దేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి నిధులు దుర్వినియోగం చేసినట్లు అభియోగాలపై సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేస్తూ జెడ్పీ సీఈవో జి .వెంకటనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై విచారణ చేసి నిధులు దుర్వినియోగం విషయం వాస్తవమని తేలితే చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకి ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మద్రిపూడి: ఈ నెల 8 నుంచి పృథులగిరి లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని కార్యనిర్వాహణాధికారి నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న అంకురార్పణ. 9న ధ్వజారోహణ, శేషావాహనం, 10న హంసవాహనం, 11న సింహవాహనం, 12న హనుమంతుని వాహనం, 13న గరుడవాహనసేవా, 14న స్వాముల వారి కల్యాణం, 15న రథోత్సవం, 16 న అశ్వవాహనం, 17న పూర్ణహుతి, 18న ఏకాంత సేవా కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. 13న గరుడ వాహనం రోజున జరుగు తిరుణాళ్ల ఉత్సవానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు లక్షల సంఖ్యలో పాల్గొంటారు. భక్తుల కోసం భోజన వసతి, తాగునీరు, బారికేడ్లు, ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించినట్లు ఆయన తెలిపారు.

పనిముట్ల కోసం దరఖాస్తులు

టంగుటూరు: కులవృత్తులు చేసే వారు వారికి కావాల్సిన పనిముట్లు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో దేవసేన కుమారి అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కులవృత్తి సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులకు ఆదరణ-3 పథకం గురించి వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, కులవృత్తి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ పరికరాల ధ్వంసం-ఆయిల్ చోరీ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

టంగుటూరు: ఎత్తిపోతల పథకం విద్యుత్ పరికరాలను ఆయిల్‌ను చోరీ చేశారు. ఈఘటన మండలంలోని పొందూరు పంచాయతీ పరిధిలోని లక్ష్మక్కపాలెం సమీపంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎత్తిపోతల పథకం గతి కొన్నేళ్లుగా పొగాకు, శనగ, తదితర పంటలకు మీరు అందిస్తోంది. శుక్రవారం ఉదయం రైతులు ఎత్తిపోతల పథకం వద్దకు పోగా అక్కడ విద్యుత్ పరికరాలు ధ్వంసం చేసి ఉండటం గమనించారు. దీంతో అందులోని ఆయిల్‌ను దొంగలు అపహరించుకుపోయారని గుర్తించారు. పోలీసులకు, విద్యుత్ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అధికారులు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు. దీనిపై టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు వివరణ కోరగా శుక్రవారం ఫిర్యాదు అందిందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.